ఆదివారం

ప్రజాశక్తి

మార్చి 23, 2003





గొంతెండుతున్న రాష్ట్రం

హ్యాపీబర్త్‌డే

(23-3-2003 నుండి 29 -3-2003 వరకు)

కార్తీక్ కుమార్‌రెడ్డి
2॥సం,23. 3. 2001
శ్రీలత-ప్రభాకర్‌రెడ్డి
దేవరకద్ర-మహబూబ్‌నగర్

ఎస్. ప్రవీణ్‌కుమార్
2॥సం, 23. 3. 2001
పుష్ప-మహేష్‌కుమార్
బోరబండ-హైదరాబాద్

లక్ష్మీకోమలి
1॥సం, 23. 3. 2002
సుజాత-విజయపుల్లారెడ్డి
కొత్తపేట-కర్నూలు

భరత్ కుమార్
3॥సం, 23. 3. 2000
లక్ష్మి-సత్యనారాయణ
సత్యనారాయణ నగర్-కృష్ణ

సూర్యతేజ
4॥సం,24. 3. 1999
కవిత-ధనుంజయ్
కరకంబాడి-చిత్తూరు

అమ్మూ
1॥సం, 24. 3. 2002
ఉమామహేశ్వరి- నర్సింహ్మాచారి
భిక్కనూరు-నిజామాబాద్

డి.జలంధర్
1సం॥, 25.3.2002
కల్పన-సాయిలు
కన్నోరా- ఆదిలాబాద్

ఏకాశి ప్రభుదీపిక
2॥సం, 27. 3. 2001
మేరీసుజాత-రత్నం
అల్లూరిసీతారామరాజు నగర్-కడప

రూఫస్ ప్రాజిత్
1॥సం,28. 3. 2002
రేఖాజ్యోతి-బాబూరావు
గుళ్ళపల్లి-గుంటూరు

జి.ఆశ్లేష పృధ్వీరాజు
4॥సం,28. 3. 1999
నీలారాణి-కృష్ణంరాజు
మకంపేట-కృష్ణ

...లు అద్దుదామా!



...ల బొమ్మ రావాలంటే...

...న్న ఓ బుజ్జి నేస్తం నాదగ్గరకొచ్చాడు. తెల్లకాగితం ... 'దీన్ని మా ఫ్రెండ్ ఇచ్చాడు. వేడి చేస్తే రంగుల బొమ్మ ...సుకో' అన్నాడు. అసలు ఇదెలా సాధ్యం?' అనడిగాడు. ... చూయించమన్నాడు. చూపించా. ఆశ్చర్యపోయాడు. ...తో మీకూ చెప్పాలనుంది. చెప్పనా...ఓ తెల్లటి కాగితం ...తర్వాత కోబాల్టు క్లోరైడ్, కోబాల్టు ఎసిటేట్, కోబాల్టు ...కొద్దిగా వేరు వేరు పాత్రల్లో తీసుకోండి. వీటిని కుంచెతో ...మీద మీకిష్టమైన బొమ్మ వేయండి. దాన్ని కాండిల్ ...డండి. రంగురంగుల బొమ్మ ప్రత్యక్షమౌతుంది. ఇదంతా ...ందంటే... మీరు వాడిన కోబాల్టు క్లోరైడు గీతలు (కాండిల్ ...పచ్చ రంగుగాను, కోబాల్టు ఎసిటేట్ గీతలు నీలం ...మారుతాయి. కోబాల్ట్ ఆక్సైడ్‌తో గీసిన గీతలు గులాబీ ...రతాయి. అదన్నమాట సంగతి.



బంగారు మొక్కలు

ఓసారి నసీరుద్దీన్ జల్లెడపడుతున్నాడు. అటుగా వెళుతున్న జమీందారు ఇది చూశాడు. 'ఏంటయ్యా నసీరుద్దీన్! జల్లెడ వడుతున్నావు?' అనడిగాడు. 'అయ్యా! ఇవి బంగారు ముక్కలు. వీటిలో పెద్ద వాటిని భూమిలో నాటుదామనుకుంటున్నాను. ఔన్సు బంగారం నాటితే పౌండు బంగారాన్నిస్తుంది' అని చెప్పాడు నమ్మకంగా. 'ఆహా! అలాగైతే ఈ భూమి నాదేకదా. ఇద్దరం కలిసి బంగారు మొక్కలు నాటుదాం. వచ్చిన బంగారంలో నాకు ఎనభైశాతం ఇవ్వాలి' అన్నాడు. నసీరుద్దీన్ సరేనన్నాడు. కాని పిసినిగొట్టు జమీందారుకు నమ్మకం కుదరక మధ్యవర్తిగా ఓ న్యాయాధిపతిని ఏర్పాటుచేశాడు. నసీరుద్దీన్ తర్వాత ఓ రోజు జమీందారు ఇంటికెళ్లి 'ఔన్స్ బంగారం నాటానండీ. పౌండు బంగారం పండింది. మీ వాటా ప్రకారం 8 ఔన్సుల బంగారం తీసుకోండి' అని బంగారం చేతిలో పెట్టాడు. జమీందారు ఎంతో సంతోషపడిపోయాడు. తర్వాత మరోసారి కూడా ఇలానే జరిగింది. మూడో సారి బంగారం ఇవ్వడానికి వచ్చినప్పుడు జమీందారు పట్టలేని ఆనందంతో 'మనం ఇంకా ఎక్కువ బంగారం ఎందుకు నాటకూడదూ?' అన్నాడు. తన దగ్గర అంత బంగారం లేదన్నాడు నసీరుద్దీన్. 'నా దగ్గర వుందిగా' అని రెండు పెట్టెల బంగారం తీసి ఇస్తూ 'నేను నీకు రెండు పెట్టెల బంగారం ఇస్తున్నాను. నీవు తిరిగి నాకు పదహారు పెట్టెల బంగారం ఇవ్వాలి సుమా! బంగారం జాగ్రత్త' అని చెప్పాడు. ఒక వారం తర్వాత నసీరుద్దీన్ నీరసంగా వచ్చి ఏడుపుమొహం పెట్టి 'జమీందారుగారూ అంతా బూడిదలో పోసిన పన్నీరైంది. వర్షాలు లేక బంగారు మొక్కలు చనిపోయాయి' అని ఏడ్చేశాడు. జమీందారుకు కోపం వచ్చేసింది. వెంటనే మధ్యవర్తి న్యాయాధిపతిని పిలిపించాడు. ఆయన వచ్చి 'ఏంటి సంగతి? అసలు బంగారు మొక్కలు ఎలా చనిపోతాయి?' అనడిగాడు. దానికి నసీరుద్దీన్ అమాయకంగా మొహం పెట్టి 'అయ్యా న్యాయాధిపతిగారూ... బంగారు మొక్కలు పెరిగి బంగారాన్నివ్వగా లేంది, చనిపోవడంలో ఆశ్చర్యం ఏముంది? బంగారం పండిందని చెప్పినప్పుడు నమ్మగా లేంది ఇప్పుడు చనిపోయాయని చెప్పినప్పుడు ఎందుకు నమ్మరు?' అనడిగాడు. దానికి న్యాయాధిపతి, జమీందారు నోరు మెదపలేకపోయారు. పిసినిగొట్టు జమీందారుకు తగిన శాస్తి జరిగినందుకు ప్రజలంతా సంతోషించారు.

కలం స్నేహం

పేరు: జి.జాని,
వయసు : 14 సం॥
చదువు :9 వతరగతి
హాబీలు :క్రికెట్ ఆడడం, చెస్ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : జి.జాని, సన్నాఫ్ జి.రాములు, ఇంటినెంబరు: 323 / 3, వడ్డెర బస్తీ, తాటికల్‌రోడ్, నకిరేకల్, నల్గొండ.

పేరు: జి.సైదులు,
వయసు : 14 సం॥
చదువు : 8 వతరగతి
హాబీలు : డ్రాయింగ్ వేయడం, డాన్స్ చేయడం, కథలు, పేపరు చదవడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : జి.సైదులు, డాటరాఫ్ జి.లక్ష్మమ్మ, ఖానాపూర్, మహబూబ్‌నగర్.

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	డ
	వు
	రు
	లం
	టు
	చం

గతవారం జవాబులు

నే	ల
	ను
	ష్టం
	రం
	త

మహాసిద్ధియోగం



* రుక్మిణి

సిద్ధయ్య పని చేస్తున్న కంపెనీలో కచ్చితంగా వి.ఆర్.యస్ అమలు కాబోతుందనే తాజావార్త ఆ మధ్యాహ్నం లంచవర్లో సిద్ధయ్య చెవిలో పడింది. అందులోని రెండు ముఖ్యాంశాలు సిద్ధయ్యను కలవరపాటుకు గురి చేశాయి!

ఒకటి - ఈ వి.ఆర్.ఎస్స్ బలవంతంగానైనా సరే కంపెనీ అమలు చేసి పారేస్తుందీ.. తప్పదు.. మడుగున దాగియున్నన్ రాజరాజా..." అన్న అంశం ఒకటైతే - కర్మకాలి సిద్ధయ్యపేరు అందులో నెంబర్ 'వన్' అనీనూ.. లిస్టు తాను తన కళ్ళతో చూడకున్నా, చూసినంత నిజనే సుమా...! అని అటెండరు రామస్వామి బల్లగుద్ది మరీ చెప్పడంతో సిద్ధయ్య అవాక్కుకు గురి కావడం.. నిశ్చేష్టుడవడం.. కొయ్యబారి పోవడం... వగైరా... వగైరాలు వెనువెంటనే జరిగిపోయాయి. అదీ ఆ మధ్యాహ్నం జరిగిన సంగతి!

రెండోది - సిద్ధయ్యకు తన బాల్యమంటే చాలా ఇష్టం. అట్లా అని అతడేమీ నోట్లో బంగారు చెంచాలు కరుచుకునిపుట్టిన బాపతేం కాదు కానీ.. కానీ.. అబ్బో పాతికేళ్ళ నాటి ముచ్చట్లు... ఆ పల్లెటూర్లో జనాలు.. అమాయకమైన మాటలు... మంచిగాలీ.. చెరువుల నిండా నీళ్ళలో ఈతలు.. చేబదులడుక్కోడం తప్ప మరీ అంతగా కనిపించని బిచ్చగాండ్లూ.. ఊరిబడిలో ఆటపాటలూ.. పాటలూ పద్యాలు... హరికథలూ... అరుగుల మీద చలినెగళ్ళు కాగుతూ తాతయ్యల కథలు.. అన్నీ మాయమైపోయాయి గదా!

అవన్నీ గుర్తుకు వస్తుంటే సిద్ధయ్య కళ్ళనిండా నీళ్ళు గిర్రున తిరిగేవి. ఎవడూ చూడకుండా తుడుచుకుని ఫైళ్ళలో తలదాచుకునే వాడు. ఈ ప్రస్తుత పరిస్థితుల్లో ఆ జ్ఞాపకాల బరువులు తప్ప కళ్ళకు మరేం కనిపించడం లేదు. రాన్రాను ఈ ప్రపంచం బాగా ఇరుకైపోతున్నట్లు.. రోజురోజుకీ తన ఒంట్లోంచి ఒక్కో రక్తపు చుక్కా ఆవిరైపోతున్నట్లు బాధ... నరకం... యమలోకం... భీకరం...

చేతికి వస్తున్న జీతపురాళ్ళతో ప్రతి ఒకటో తారీఖు ఒకటో రకమైన సర్కసు ఫీటు చేసినా అవి ఎటూ అంది చావవు... గందరగోళం.. "అవసరం' మీద అవసరం వాటంతటవే వచ్చి పడడం వేరు. ఇదేమో 'అవసరాల్ని' విధిగా మరీ కల్పించే తప్పనిసరి కల్పిత అవసరాలు. ఈ అక్కరలన్నీ కృత్రిమంగా రోజురోజుకీ వచ్చిపడుతున్న కల్పితాలేననే నిజాలు తెలుసుకుంటున్న కొద్దీ సిద్ధయ్యలో తిక్కరేగిపోతుంది... తుక... తుక..

ఆ రోజు అర్ధరాత్రి దాకా ఊపిరి బిగబట్టి ఇక తట్టుకోలేక పెద్దగా నిట్టూర్చి నిద్దట్లోని భార్యను తట్టిలేపి చెప్పేశాడు. విషయం అంతా విని ఆవిడ ముందు వింతగా చూసి ఆనక గుడ్లు తేలేసింది.

"ఏంటీ... హిమాలయాలకు పోతారా? ఏం ఇక్కడే ఏదో ఇన్‌స్టాల్‌మెంట్ల మీద ఏ.సి. పెట్టించుకుంటే పోలా... అంతమాత్రం దానికి అంతదూరం దాకా ఎందుకూ?"

సిద్ధయ్య ఒళ్ళు భగభగా మండినా తమాయించుకుని జాలిగా నవ్వాడు.

"ఆండాళూ.. సీరియస్‌గా చెపుతుంటే జోకులు ప్రేల్చకు. నేనేం అల్లాటప్పా హనీమూన్‌కు పోవడం లేదు. నిజం... ఈ క్షుద్ర ప్రపంచం చాలా నీచంగా.. బహు చండాలంగా... కిరాతకంగా మారి పోతోంది. అసలు మనిషన్నవాడు బతకడం కష్టం! ఛ... ఛ... అసలింత కాలం నేను ఎట్లా ఈ రొంపిలో.. లంపటంలో పందిలా బతికానో తలుచుకుంటే నాకే గబ్బు.. వెగటు పుడుతుంది..

ఆండాళు మిర్రిమిర్రి చూసింది. పిల్లలిద్దరూ హాయిగా నిద్రపోతున్నారు.

"పాపం కొండలా పెరిగిపోతోంది. అవినీతికంతులేదు... ఎడాపెడా... దీనికి విరుగుడు వెంటనే కావాలి.. ఇంకా ఆలస్యమైతే మరీ ప్రమాదం...

"అది సరే.. ఆ మంచుకొండల్లోకి పోయి ఏం పావుకుందామనీ.. "ఛస్! నోర్మూయ్! అల్పపు మాటలు మాట్లాడకు-కొంతకాలం నేను ఏకాంతంగా సమాధిలోకి పోయి మహాసిద్ధియోగం సాధించి తీరాలి. ఆ అమృత ఘడియల కోసమే ఈ ప్రయత్నం. నాకు విముక్తి అట్లాగే దొరుకుతుంది. ఈ విషపు గాలులు పీలుస్తూ నేను బతకలేను - నాకూపిరాడ్డం లేదు.

ఆండాళు సిద్ధయ్య బుర్రకాయకేసి బాగా తేరిపారజూసింది. అది సరిగ్గా దాని స్థానంలోనే ఉంది. "సరే.. ఆ యోగసిద్ధి అక్కడే పొందాలా... సర్సరే గానీ.. దానికి గడువెంత? అది పొందింతర్వాత జరిగేదేంటి? ఈ మన అవతారాలు ఇట్లాగే ఉంటాయా.. వీటిని విడిచేసి మనం మరో తోలు కప్పుకునే ఏర్పాటేదైనా వుందా? రంగు మారుతుందా? ఎందుకో అట్లాంటి గంభీరమైన సంక్లిష్ట సమయంలో ఆండాళుకు, అసలైతే ఏడుపు తన్నుకు రావాలి.. గుండెలు లపలప బాదుకుంటూ ఏడవాలి.. కన్నీటి కెరటం ఉప్పెనలా విరుచుకు పడాలి.. కానీ.. ఆవిడ మాత్రం ఎంత ఆపుకుందామనుకున్నా నవ్వును దాచుకోలేక కిసకిసా నవ్వుతూనే తన సందేహాలన్నింటినీ అడిగేసింది!

సిద్ధయ్య మహారాజ్‌కు కూడా పీకామెయ్యా కోపం రావల్సిందేగానీ మరో కొన్ని ఘడియల్లో 'మహాయోగసిద్ధి' నిమిత్తం ప్రయాణ సన్నాహాల్లో వున్నాడు కాబట్టి పళ్ళ బిగుతున కోపాన్ని దిగమింగుకున్నాడు.

"మూర్ఖురాలా.. ఈ ప్రపంచం నానాటికీ దుర్భరంగా మారిపోతుందంటే వినవే! మనిషి అస్తిత్వం అడుగూడి బోలుగా తయారై పోతున్నాడు. తిరిగీ ఈ జాతిని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడానికి 'మహాయోగసిద్ధి' ఒకటే అసలు సిసలు మార్గం! హరోం.. హరహర...

సిద్ధయ్య అప్పటికే సాయంత్రం నుండీ ఏర్పాటు చేసి వుంచుకున్న హంగూ ఆర్భాటం చూసి ఆండాళ్ళు హడలిపోయింది. ఎంచక్కా కాషాయ అంగరఖా... పొడవాటి జోబీలు.. మాంచి వాటమైన జోలె.. పైగా టేకు చెక్క పాంకోళ్ళు... ఆ అపరాత్రి వేళనే ఓ సీసా బిరడా మూత పీకి - దాన్లో నుండి చిక్కటి మర్రిపాలు కామోసు లపలప అద్దం ముందు కూలబడి తలవెంట్రుకలకి జుర్రుకున్నాడు. అవి నీలిగి నీలక్కరిచి ఎక్కడికక్కడే కర్రపుల్లల్లా బిగుసుకున్నాయి.

ఆండాళు కాళ్ళూ చేతులూ ఆడడం లేదు. అటు చూస్తే తొలికోడి కూసే వేళయిపోతుంది. చివరి అస్త్రంగా కన్నీళ్ళను ఉపయోగిద్దామంటే - అవి ఒక్క పట్టాన వచ్చి చావడం లేదు.

"అయితే మీ ప్రయత్నం మీరు మానుకోనంటారు?" కాస్త కటువుగానే అంది.

"ఆండాళూ... ఇది ఎవడి మీద కోపంతోనో.. ద్వేషంతోనో కాదే.. లోక కళ్యాణార్థం ఇది తప్పదు... నా ఒక్కడి సుఖం.. నీతో సంసారం... వెలగబెట్టడం.. వరకే అయితే బాగానే వుండును... లోకకళ్యాణం ముఖ్యం కదా!"

ఆండాళులో అప్పటికే దుంఖం కట్టలు తెంచుకుంది. మౌనంగా పమిట నోట్లో కుక్కుకుని వెక్కివెక్కి ఏడవసాగింది. సిద్ధయ్య సాధ్యమైనంతగా మొహాన్ని పరమ పవిత్రంగా పెట్టి, ఈ ఏడుపులనీ, పిల్లల్నీ ఖాతరు చెయ్యకుండా, రెట్టించిన ఉత్సాహంతో పెద్దజోలె చంకకు తగిలించుకున్నాడు.

హఠాత్తుగా ఆండాళు కళ్ళు తుడుచుకుని లేచి గుమ్మానికి అడ్డంగా నిలబడింది... ఆవిడ మొహం చాలా ప్రశాంతంగా వుంది.

"ఏంటి? లే... లే.. మళ్ళా తెల్లారిపోతే ప్రమాదం.. ఎవడూ లేవకముందే హిమాలయాలకు చెక్కేయాలి.. లే.. లే... చూస్తే భద్రాచలం బిచ్చగాణ్ణనుకుంటారు...

"పదండి.. నేనూ ఆ పరమ యోగసిద్ధి పొందడానికి మీ వెంటే వస్తా.. నాకూ ఈ ప్రపంచం మీ కన్నా పరమ నీచంగా... చండాలంగా కనిపిస్తోంది.. బతకడం అంటే భయం.. అసలు ఊపిరాడ్డం లేదు - నీచమైన కంపు వాసన వేస్తుంది.. ఛ.. ఛ...

సిద్ధయ్య అవాక్కై జోలెతో సహా మంచం మీద కూలబడ్డాడు. తర్వాత మరి జీవిత కాలంలో 'సిద్ధిమహాయోగం' గురించి మాట ఎత్తితే ఒట్టు! ◆

✻ లక్ష్మి

వానొచ్చింది!

సినీమాల్లో-

ప్రమిదలో ఒత్తి కొండెక్కుతుంది! ఇదొక షాటు. మంచమ్మీద వున్న మనిషి కన్నుమూస్తాడు. ఇది రెండో షాటు. ఈ రెండు షాట్ల వల్ల మనకేం తెలుస్తుంది? ఒక ప్రాణం లేచిపోయిందని బాగా అర్థమవుతుంది! కదా? అంటే ఏమిటి? ప్రాణానికీ దీపానికీ లింకు పెట్టేరన్న మాట సినీ శాస్త్రజ్ఞులు! బాగా చెయ్యి తిరిగిన దర్శకరత్నాలు తమ సినిమా నిండా ఇల్లాంటి ఆణిముత్యాలు తగిలించుకుంటో - సినిమా తీస్తారు! చావు సీన్లని విడిచిపెట్టండి. కొన్ని ఫైటు సీన్లు కూడా సినీమాల్లో వుంటాయి. ఆ సీన్లు చిత్రీకరించేప్పుడు కూడా దర్శకులు కొన్ని చమత్కారాలు చేస్తుంటారు! హీరోగారు విలన్ని చావగొడుతుంటాడు. ఆ యొక్క ఫైట్ ఫీటు బాగా రక్తికట్టేందుకుగాను - ఆ సీనుకు సంబంధంలేని ఇంకో సీను అర్జంటుగా తగిలిస్తారు. ఒక మాంసం దుకాణంలో కైమా తయారీ చిత్రీకరిస్తారు! దాంతో సదరు హీరోగారు విలన్ని కైమా చేస్తున్నారు సుమా అనే మీనింగు ప్రేక్షకులకు ఈజీగా అందుతుంది. ప్రేక్షకులు - ఓహో దర్శకత్వపు ప్రతిభ అమోఘం అని మురిసిపోతారు! అల్లాంటి ఫైటింగ్ సీన్లోనే కొందరు దర్శకులు సడన్‌గా చాకిరేవు చూపిస్తారు. ఆ రేవులో బండమీద బట్టల్ని ఉతకడం చూపించి - ప్రేక్షకుల చేత భేషనిపించుకుంటారు! ఈ విధంగా ముఖ్యమైన సీన్లకి ఉపసీన్లు కొన్ని వాడి - ఆ కథని రక్తికట్టించేందుకు దర్శకులు గట్టిగా కృషి చేస్తుంటారు. వదిలేయండి!

రొమాన్సు బాగా పండాలంటే సమస్తమైన దర్శకులూ వానసీన్లు పెడుతుంటారు. నేలమీద వాన ఏ ఖర్చులేకుండా పడొచ్చు. సినిమాలో వాన అట్లాకాదు. ఆర్టిఫిషియల్ రెయిన్‌గదా - దానికి బందోబస్తు మస్తుగా ఉండాలి! అంచేత బోలెడు ఖర్చు కూడా అవుతుంది! అంత ఖర్చు మాకొద్దంటే వాన పడదు. వానపడకుండా రొమాన్సు సీను నడిపిస్తే నీరసంగా ఉంటుంది. కళాత్మకంగా వుండదు. అందువల్ల ఖర్చు కోసం బెంగపడకుండా - రొమాన్సు సీను చేసేప్పుడు వాన కురిపించాలి. తప్పదు. వానకీ శృంగారానికీ చాలా దగ్గిర సంబంధముందని సినీశాస్త్రం చెబుతోంది! అంచేత రొమాన్సు పండాలంటే వాన కురిపించాలి. వానలేని శృంగారం రక్తికట్టదు. పైగా - వానసీను సినీమాలో కనిపించగానే అక్కడ్నించి ఆ కథ కొత్త మలుపు తిరుగుతుంది. ప్రేక్షకులు ఊపిరి పీల్చడం కూడా మానేసుకుని ఎంతో ఆసక్తితో చూస్తుంటారు. ఆ వానలో హీరోహీరోయిన్లు డ్యూయెట్టు పాడుకుంటో తడిసి ముద్దవుతారు! ఆ స్థితిలో వాళ్లు తమని తాము మరిచిపోతారు. తాము ఏమి చేస్తున్నామో కూడా గమనించరు.

సినీమా పరంగా వాన వచ్చినప్పుడు - హీరో హీరోయిన్లు ఎంత బుద్ధిమంతులైనా - కాలు జారతారు! తప్పు జరిగిపోతుంది! హీరో అర్జంటుగా అమెరికా వెళ్ళాల్సి వస్తుంది గనక అతను అమెరికాకు ఎగిరిపోతాడు. ఎగిరిపోయేందుకు అమెరికానే ఎంచుకోవాలా అని అడక్కూడదు. సినీమాలకి అమెరికా బాగా అచ్చివచ్చింది. అంచేత సినీమాల్లో ఎప్పుడూ అమెరికా గురించే ప్రస్తావిస్తారు. సినీమాలు చూస్తున్న జనం కూడా అమెరికా అంటేనే ప్రాణం పెడుతున్నారు. అంచేత సినీమాల్లో పాటు జీవితంలో కూడా అమెరికాకి డిమేండెక్కువ! మా అబ్బాయి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరంటారే గాని - ఆస్ట్రేలియాలో ఆర్కిటెక్ట్ అనిగానీ, న్యూజిలేండ్‌లో న్యూరాలజిస్టని గానీ ఎవ్వరూ అనగా నేను వినలేదు! ఆస్ట్రేలియా న్యూజిలాండ్‌లు మనకి అనకాపల్లి, ఆముదాలవలసలాంటివి! ఇప్పుడా విషయం అనవసరం గనక విడిచిపెట్టండి! కథలోకి వద్దాం! హీరో అమెరికా వెళ్ళిం తర్వాత హీరోయిన్ ఇండియాలో గర్భవతి అవుతుంది. కాని వాళ్లు సరేసరి - కన్న వాళ్లు కూడా హీరోయిన్‌ని తలోమాట అంటారు! ఎవరు ఎన్ని విధాల అవమానించినా - హీరోయిన్ చలించదు! నా మోహన్ నన్ను అన్యాయం చేయడనే ధీమాతో తొమ్మిది నెలలూ గడుపుతుంది హీరోయిన్!

ఆ తర్వాత ఆమె ఒక బాబుకో, పాపకో తల్లవుతుంది! అప్పుడు హీరోగారు అమెరికా నుంచి తిరిగొస్తారు. ఇక అక్కడ్నించి హీరోయిన్ తాలూకు కష్టాల కథ ఒక్కో సినీమాలో ఒక్కో రకంగా నడుస్తుంది. సినీమాల్లో కూడా హీరోయిన్ - అనగా ఆడవాళ్ళు మాత్రమే కష్టాల్లో పడాలి! అది రూలు! వాళ్లు ఎన్ని కష్టాల్లో పడితే ఆ సినిమా అంత బాగా హిట్టవుతుందన్నమాట! ఆడవాళ్ల కష్టాల మీద ఇంట్రెస్టెక్కువ! హీరోగారు మాత్రం చెక్కు చెదరకుండా వుంటారు. తాను మనసు పడ్డ హీరోయిన్ తనని దగా చేసిందని వర్రీ అవుతుంటారు. ఆ వర్రీలో తాగుతుంటారు. విషాదాన్ని మింగుతూ ఉంటారు. అంతేగాని హీరో చేసిన తప్పుని ఎవరూ గుర్తు పెట్టుకోరు! ఒకవేళ గుర్తుకొచ్చినా - ఆ తప్పంతా వానకి అంటగడతారు! హీరో ఎల్లప్పుడూ బుద్ధిమంతుడే! ఈ బుద్ధిమంతుడు తప్పుడు పని చేస్తేనే గాని కథ ముందుకు సాగదు. అంతమాత్రాన అతను రౌడీ వెధవ అనిపించుకుంటే అతని హీరోయిజం దెబ్బతింటుంది. దాంతో ఆ సినీమా అట్టరు ఫ్లాపవుతుంది! అంచేత - ఆ తప్పు అతన్ది కాదు - తప్పంతా వర్షానిదేనని సర్దేస్తారు!

పురాణ గాథల్లో కూడా ఇదే తంతు! దుష్యంతుడి కథ తీసుకోండి. అతను శకుంతలను చాటుగా పెళ్లి చేసుకున్నాడు! పెళ్ళాడి వెళ్లొస్తానని తన రాజధానికి వెళ్లిపోయేడు. వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన ఆ మారాజు మళ్లా తిరిగి రాలేదు. మాట తప్పిన మగాడు అంటే మాటొస్తుందని కవిగారి భయం! మగాడి మార్కెట్టు పడిపోతుందని బెంగ! అంచేత తనకి పెళ్లయిన మాట మరిచిపోతాడన్నారు. ఆ మరిచిపోవడం కూడా అవలక్షణమే గదా అని ప్రశ్నిస్తారేమోనన్న డవుటుతో - అదొక శాపమన్నారు! అంచేత తప్పంతా శాపమ్మీద నెట్టేసి శ్రీదుష్యంతుల వారిని మచ్చలేని మారాజుగా నిలబెట్టేసేరు! కేవలం శాపం మూలంగా దుష్యంతుల వారు శకుంతలను మరిచిపోయేడే గాని - వాస్తవానికి అతడు మగజాతికి మణిపూస గదా అని మెచ్చుకున్నారు! ఇంచుమించు శాపం లాంటిదే వర్షం కూడాను! పురాణగాథల్లో శాపాల మాదిరి సినీమాల్లో వర్షాలు పని చేస్తాయి!

ఇంత చెప్పడానికి కారణం కూడా చెప్పాలి గదా! మా పక్కింటి ప్రభావతి విపరీతంగా సినీమాలు చూస్తుంది. వాన సినీమాలు చూసిచూసి వాన ఫిలాసఫీ బాగావంట బట్టించుకుంది. మొన్నామధ్య భాగ్యనగరంలో కురిసిన వానకి నేను సంతోషిస్తుంటే - ప్రభావతి కళ్లనీళ్ళు పెట్టుకుని మా ఇంటికి వచ్చింది! ప్రభావతి ఏడుస్తూ మా ఇంటికి ఎందుకొచ్చిందో తెలీక కారణమేమిటని అడిగేను. దిక్కుమాలిన వర్షం! ఈ ముదనష్టపు వర్షంలో ఎక్కడో చోట ఎవరో ఒక ఆడపిల్ల ఏ దుష్యంతుడి చేతిలోనో అన్యాయమై పోతుందనే దిగుల్తో ఏడుపొస్తోందండీ! ఆ పాడు దేవుడు ఈ వానల్లేకుండా చేస్తే ఎంత బావుండునూ అన్నది అమాయకంగా! సినిమాల ప్రభావం ప్రభావతి మీద ఇంతగట్టిగా పడినందుకు ఆశ్చర్యపోయేను! మందలిస్తే మరింత ఏడుస్తుందేమోనన్న భయంతో వానల వల్ల ఉపయోగాలేమిటో వివరించేను! నేను చెప్పింది విన్నదేగాని - వింటున్నంత సేపూ కళ్ళొత్తుకుంటూనే విన్నది! నాకు తెలుసు - ప్రభావతి వానని క్షమించలేదు! క్షమించదు! ◆

టూరిస్ట్‌గైడ్



మన దేశంలోని ఈశాన్య ప్రాంతాన్ని తలచుకోగానే ఎత్తయిన పర్వతాలు, పచ్చని దట్టమైన అడవులు, నదులు, జలపాతాలు, పక్షులు, అటవీ జంతువులు మన మనోఫలకంలో మెదులుతాయి. మహోన్నత పర్వతాలు, లోతైన లోయలు, గలగలపారే జలాలు ఈ ప్రాంతానికి ప్రకృతి ప్రసాదించిన వరాలు. వీటికితోడు సంపద్వంతమైన కళలు, హస్త కళలు, చక్కటి ఆతిథ్యమిచ్చే ప్రజలు, రంగురంగుల ఉత్సవాలు కూడా ఇక్కడ మనకు దర్శనమిస్తాయి. 'ఉషోదయ పర్వతాల నేల'గా పేరుగాంచిన అరుణాచల్ ప్రదేశ్‌లో కూడా ఎన్నో ప్రకృతి సోయగాలు మనకు ఆహ్లాదాన్నిస్తాయి.

అందాల అరుణాచల్

*** సర్వేష్**



తూర్పు హిమాలయ పర్వత సానువుల్లో 83,743 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం విస్తరించి ఉంది. దీనికి ఉత్తరాన మంచుపర్వతాలు, దక్షిణాన బ్రహ్మపుత్ర లోయ విస్తరించి ఉంది. పచ్చని అడవులు, లోతైన నదీ లోయలు, మంచుతో కప్పి ఉన్న పర్వతాలు, సుందర మైదానాలను చూసి మేము తన్మయం చెందాము. ఈ ప్రాంతంలోని పర్వతాలు 1,829 మీటర్ల నుంచి 6,400 మీటర్ల ఎత్తున ఉన్నాయి.

ఈ అద్భుతమైన రాష్ట్రం సాహస పర్యాటకులకు కూడా చక్కని అనుభూతులను మిగుల్చుతుంది. పర్వతారోహణ నుంచి చేపలవేట వరకూ ఏదైనా సాధ్యమే. ఇక్కడి నదులు బోటు షికారుకు, రాఫ్టింగ్‌కు, చేపల వేటకు అనుకూలంగా ఉండగా ఇతర భూభాగాలు పర్వతారోహణకు, హైకింగ్‌కు అత్యంత సానుకూలంగా ఉంటాయి. నదిలో రాఫ్టింగ్‌కు వెళ్ళే అవకాశం మాకు లభించింది. రాఫ్టింగ్ చేసేటపుడు మాకు చాలా భయమేసింది.

పర్వతారోహణ పట్ల ఆసక్తి ఉన్న వారికి అరుణాచల్ ప్రదేశ్‌లో చక్కటి అవకాశాలున్నాయి. మొదటి మార్గం సియాంగ్ నుంచి ప్రారంభమై దట్టమైన అడవుల గుండా సాగుతుంది. ఈ మార్గం చక్కటి వృక్ష, జంతు జాలంతో నిండి ఉంటుంది. ఫొటోగ్రఫీ పట్ల ఆసక్తి వున్న వారు ఓపినన్ని సుందర దృశ్యాలను తమ కెమెరాలలో బంధించుకోవచ్చు. మా రెండవ గమ్యస్థానం బోయ్‌డిలా. అక్కడికి చేరాలంటే సముద్ర మట్టానికి 14 వేల అడుగుల ఎత్తున ఉన్న సేలాపాస్‌ను దాటాలి. సన్నని పర్వత మార్గం ద్వారా ప్యారడైజ్ లేక్ మీదుగా వెళ్ళాము. ఆ మార్గంలో మేము మరో సరస్సును కూడా చూశాము. దానిని 'దాగివున్న సరస్సు' (హిడెన్ లేక్) అంటారు. ఈ సరస్సు అద్భుత అందాలను తిలకించాలంటే 400 మీటర్ల ఎగువకు వెళ్ళాల్సి ఉంటుంది.

మూడవ మార్గం మమ్ముల్ని ఆనినికి తీసుకెళ్ళింది. అక్కడి అత్యున్నత పర్వత శిఖరం మయూదియా (2,443 మీటర్ల ఎత్తు). దానిని తప్పనిసరిగా చూడాలి. ఇతర ఆసక్తికరమైన పర్యాటక ప్రాంతాలు మెహావో సరస్సులోని పక్షి సంరక్షణా కేంద్రం, సల్లీ సరస్సు. సల్లీ సరస్సులో నౌకావిహారం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

అరుణాచల్ ప్రదేశ్ వివిధ రకాలైన వన్యప్రాణులకు ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ పులి, చిరుతపులి, గోల్డెన్ క్యాట్, ఖ్యాతి గాంచిన అతి పెద్ద క్షీరదం 'మిథున్' వంటి జంతువులు ఉన్నాయి. ఎత్తయిన ప్రాంతాలలో ఉండే కస్తూరి మృగం, భారల్ వంటి జంతువులు కూడా అరుణాచల్ ప్రదేశ్‌లో ఉన్నాయి.

ఉత్సవాలు, పండుగలు ఈ రాష్ట్ర ప్రజల జీవితంలో భాగంగా ఉన్నాయి. ఇలాంటి పండుగలలో అక్టోబర్‌లో జరిగే బుద్ధ మహోత్సవం, తవాంగ్ జిల్లా, లోసార్, లేహ్ వంటి చోట్ల వసంత ఋతువులో జరిగే ఉత్సవం ముఖ్యమైనవి.

లోతైన, అద్భుతమైన లోయల ఒడిలో ఉన్న అందమైన ప్రాంతం తవాంగ్. ఇది సముద్ర మట్టానికి 3,500 మీటర్ల ఎగువన హిమాలయ పర్వత సానువుల్లో ఉంది. దీనిని మొనాస్టరీల భూమిగా పిలుస్తారు. దీనికి మరోపేరు మాన్యల్. తవాంగ్ మొనాస్టరీ అతి పెద్ద కట్టడం. ఇక్కడ సందర్శనీయమైన అనేక మొనాస్టరీలున్నాయి.

ఇక్కడ దాగి వున్న అద్భుత అందాలను ఆస్వాదించే అవకాశం మాకు లభించింది. దీనికి 42 కిలోమీటర్ల దూరంలో నురనాంగ్ జలపాతం, సాంగెస్టార్, పాంగాంగ్-తాంగ్, సో సరస్సులు ఉన్నాయి. వేసవికాలంలో ఈ సరస్సుల చుట్టూ అందమైన రంగురంగుల పూలు దర్శనమిస్తాయి. చలి కాలంలో మంచు దుప్పటి పరచినట్లుగా ఉంటుంది.

మా తదుపరి మజిల్ ఆరోగ్యాన్నిచ్చే నీటి బుగ్గలు. తేలికగా వెళ్ళగలిగేవి తింగ్‌బూ, ట్సాచు వేడి నీటి బుగ్గలు. ఇక్కడి వెచ్చటి, సల్ఫర్ అధికంగా ఉండే నీరు అనేక చర్మరోగాలకు అద్భుత ఔషధంగా పని చేయడం ఆశ్చర్యకరం.

వసంతోత్సవాన్ని తవాంగ్ ప్రజలు గొప్ప ఉత్సాహంతో, ఘనంగా జరుపుతారు. ఋతువుల రారాజుగా వసంత ఋతువు వెలుగొందుతుంది. అంతేగాక బుద్ధపూర్ణిమను కూడా పెద్ద ఎత్తున జరుపుతారు. ఇది సగా దవాగా ప్రసిద్ధి కెక్కింది. పర్వతారోహకులను, సాహసాలు చేయాలనుకునే వారిని ఆకర్షించే మరో అంశమేమంటే ఇక్కడ విభిన్నమైన ఎత్తుల్లో పర్వతాలుండటం. ఈ ప్రాంతంలోని ఎత్తయిన పర్వతం గోరీచెన్. దీని ఎత్తు 22,500 అడుగులు. అరుణాచల్ ప్రదేశ్ అద్భుతమైన హస్తకళలకు ప్రసిద్ధి చెందింది. బట్టలు నేయడం మహిళలకు ప్రధాన వృత్తి. చెక్కతో బొమ్మలు తయారు చేయడం గిరిజనుల ముఖ్య వృత్తుల్లో ఒకటి.

అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లోని బుద్ధుని ఆలయం అద్భుత అందాలతో ఉంటుంది. ఇక్కడ దలైలామా నాటిన ఒక చెట్టు ఉంది. ఈ ఆలయం వద్ద నిలబడితే ఈటానగర్ మొత్తాన్ని తిలకించవచ్చు. ◆

ఆస్ట్రేలియా జైత్ర యాత్ర

* లిఖిత నర్వనేని

రెండేళ్ల కిందట వరుసగా 16 టెస్టు మ్యాచ్‌ల్లో గెలుపొందిన ఏకైక జట్టుగా ఆస్ట్రేలియా రికార్డు సృష్టించింది. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ఎనిమిదవ వరల్డ్‌కప్‌లో అప్రతిహతంగా జైత్రయాత్ర కొనసాగిస్తున్న ఆసీస్ వన్డే పోటీల్లోనూ వరుసగా 16 విజయాలు సాధించి చరిత్ర సృష్టించింది. గతంలో విండీస్ వరుసగా 12 విజయాలు సాధించింది. ఈ రికార్డును ఆసీస్ చెరిపివేసింది. వరల్డ్‌కప్ మ్యాచ్‌ల్లోనూ వరుసగా 11 మ్యాచ్‌ల్లో గెలిచిన ఏకైక జట్టుగా ఆస్ట్రేలియా చరిత్రకెక్కింది. 1992లో తప్ప ఇప్పటి వరకు జరిగిన ప్రతి వరల్డ్‌కప్‌లోనూ సెమీఫైనల్‌కు చేరిన ఏకైక జట్టు ఆస్ట్రేలియానే. 1987, 99లలో వరల్డ్‌కప్‌ను గెలుచుకున్న ఆసీస్ రెండు సార్లు విశ్వవిజేతగా నిలిచిన వెస్టిండీస్ సరసన చేరింది. మూడవసారి వరల్డ్‌కప్ ఎగురేసుకుపోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. పట్టుదల, ఆత్మవిశ్వాసం మెండుగా గల ఆటగాళ్లు లభిస్తుండటం ఆసీస్ జైత్రయాత్రకు కారణం. దీనికి తోడు చక్కని గేమ్‌ప్లాన్‌తో బరిలోకి దిగి ప్రత్యర్థిని నిలువరించగలుగుతోంది. భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చినా, స్వల్ప విజయలక్ష్యాన్నే ప్రత్యర్థి ముందు ఉంచినా ఏ మాత్రం ఆందోళనకు గురికాకుండా చక్కని పోరాటపటిమతో విజయం సాధించడమే ఆ జట్టు లక్ష్యం. ఆసీస్ క్రికెట్ బోర్డు కూడా పలుకుబడికి కాకుండా ఆటతీరుకు ప్రాధాన్యత ఇస్తుండటంతో నైపుణ్యం గల ఆటగాళ్లు మాత్రమే జట్టులో స్థానం పొందగలుగుతున్నారు. దాదాపు పదేళ్లకు పైగా జట్టుకు విశేష సేవలు అందించిన మార్క్‌వాను జట్టులో నుండి తొలగించడమే ఇందుకు నిదర్శనం. 1999లో వరల్డ్‌కప్ సాధించడంలో కీలక పాత్ర వహించిన స్టీవ్‌వాను ప్రస్తుతం టెస్టు మ్యాచ్‌లకే పరిమితం చేయడం చూస్తే ప్రతిభ విషయంలో ఆసీస్ రాజీపడదని స్పష్టమవుతుంది. వన్డేలకు, టెస్టు మ్యాచ్‌లకు వేర్వేరు జట్లను ఎంపిక చేయడం మొదలు పెట్టిన ఆసీస్ క్రికెట్ బోర్డు ఆటగాళ్లకూ రొటేషన్ పద్ధతిలో అవకాశాన్ని కల్పిస్తుంది. రొటేషన్ పద్ధతి వల్ల జట్టులో ఎంపికైన 15 మందికి ఆడే అవకాశం రావడంతో పాటు ఆటగాళ్లకు విశ్రాంతి లభిస్తుంది.

ప్రస్తుత ఆసీస్ జట్టు

అప్రతిహతంగా విజయాలు సాధిస్తున్న ప్రస్తుత ఆసీస్ జట్టులో ఆత్మవిశ్వాసం, పట్టుదల కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ప్రతిమ్యాచ్‌లోనూ విజయం సాధించాలనే తపన ఆటగాళ్లలో కనిపిస్తోంది. ఆసీస్ తుది జట్టులో కనీసం ఐదుగురు ఆల్‌రౌండర్లు చోటు చేసుకుంటున్నారు. వన్డే పోటీల్లో ఆల్‌రౌండర్ పాత్ర కీలకమైనది. ఇలా ఆల్‌రౌండర్లు ఎక్కువగా ఉండటంతో ఆసీస్ బ్యాటింగ్, బౌలింగ్ పటిష్టంగా మారింది. తొమ్మిదో నెంబర్ బ్యాట్స్‌మన్ వరకూ మ్యాచ్‌ను గెలిపించే సామర్థ్యం ఉండటంతో ఆస్ట్రేలియా సునాయాస విజయాలు సాధించగలుగుతోంది. ఓపెనర్ గిల్‌క్రిస్ట్, హెడెన్ జట్టుకు మంచి ఆరంభాన్ని ఇస్తుండటంతో మిడిల్ ఆర్డర్ సునాయాసంగా ఆడగలుగుతుంది. ఒక వైపు గిల్‌క్రిస్ట్ దూకుడుగా ఆడుతుంటే మరో వైపు హెడెన్ వికెట్ నిలిపే ప్రయత్నం చేస్తుంటాడు. పాంటింగ్, మార్టిన్, హెడెన్‌తో కూడిన మిడిల్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. ఇక సైమండ్స్, బిచెల్, లెహమాన్, హాగ్ హార్వే వంటి ఆల్‌రౌండర్లు ఆసీస్‌కు వెన్నెముకగా ఉన్నారు. నిప్పులు చెరిగే ఫాస్ట్ బౌలర్లు మెక్‌గ్రాత్, బ్రెట్‌లీ ఆరంభంలోనే ప్రత్యర్థి టాప్‌ఆర్డర్‌లోని కీలక బ్యాట్స్‌మెన్లను ఔట్ చేసి జట్టు విజయానికి మార్గం సుగమనం చేస్తారు. ఫీల్డింగ్‌లోనూ ఆసీస్ ఆటగాళ్లు అద్భుత ప్రతిభను కనబరుస్తుండటం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం. ఆటగాళ్ల నైపుణ్యంతో ఓటమి అంచుల్లో ఉన్న జట్టు కూడా అనేక సార్లు సమిష్టి కృషితో చక్కని విజయాలు సాధించింది. ఆటగాళ్లు ఏదశలోనూ ఆత్మవిశ్వాసాన్ని సడలించకుండా ఆడుతుండటంతో ప్రత్యర్థి జట్టు ఎంత గట్టిదైనా ఆసీస్ ముందు తలవంచక తప్పడం లేదు. కోచ్ బుచనాన్ సారథ్యంలో ఆసీస్ ఆటగాళ్లు రాటుతేలారు. నెట్‌ప్రాక్టీసులో కఠోర సాధన చేయించే బుచనాన్ ఆటగాళ్ల ఫిట్‌నెస్ విషయంలోనూ ఏ మాత్రం రాజీ పడడు.

వివాదాల్లో...

ఆసీస్ జట్టుకు ఆటతీరులో ఎంత ఖ్యాతి ఉందో వివాదాల్లో అంతకంటే ఎక్కువ పేరు ఉంది. ప్రత్యర్థులతో దురుసుగా ప్రవర్తించడం ఆసీస్ ఆటగాళ్లకే చెల్లుతుంది. ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ దూకుడుగా ఆడుతుంటే ఆసీస్ ఆటగాళ్లు సహించలేరు. సూటిపోటి మాటలతో ప్రత్యర్థి ఏకాగ్రతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తుంటారు. జాత్యహంకార వ్యాఖ్యలు చేస్తూ ప్రత్యర్థిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారు. నాలుగేళ్ల కిందట ఆస్ట్రేలియాలో జరిగిన ఒక మ్యాచ్‌లో ఆటగాళ్ల, ఆసీస్ అంపైర్ల దురుసుతనానికి విసిగి పోయిన శ్రీలంక కెప్టెన్ రణతుంగ తన ఆటగాళ్లతో మైదానం విడిచివెళ్లాడు. దీని ద్వారా ఆసీస్ ఆటగాళ్లు ప్రత్యర్థులను ఎంతటి మనోవేదనకు గురి చేస్తారో తెలుస్తుంది. ఈ దురుసుతనం కొత్తతరం ఆటగాళ్లలో ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుత వరల్డ్‌కప్‌లోనూ ఆసీస్ కెప్టెన్ చేస్తున్న వ్యాఖ్యలు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. "మా బౌలర్లు వేసే బంతులకు ప్రత్యర్థులు గాయపడవచ్చు. అలాంటి బంతులతో కీలక బ్యాట్స్‌మన్‌ను నిలవరించగలుగుతామనుకుంటే ఆ బంతులు వేయడానికి వెనుకాడం" అని శ్రీలంక కెప్టెన్ జయసూర్య బ్రెట్‌లీ బౌలింగ్‌లో గాయపడ్డ సందర్భంగా ఆసీస్ కెప్టెన్ అన్నమాటలివి. కీలక బ్యాట్స్‌మన్‌ను గాయపరుస్తామని ఆ జట్టు కెప్టెన్ వ్యాఖ్యల్లోనే తెలుస్తోంది.

కొసమెరుపు...

వరుసగా 16 టెస్టుల్లో విజయం సాధించిన ఆస్ట్రేలియా 17వ టెస్టులో భారత్ చేతిలో ఓడిపోయింది. దానితో ఆసీస్ విజయపరంపరకు బ్రేక్ పడింది. వన్డేల్లోనూ ఆస్ట్రేలియా వరుసగా 16 మ్యాచ్‌ల్లో గెలుపొందింది. నేడు ఆడే ఫైనల్ మ్యాచ్ ఆసీస్‌కు 17వ మ్యాచ్. గతంలో వలె ఎదురు దెబ్బ తలుగుతుందేమోనని ఆసీస్ ఆందోళన చెందుతోంది. ఆసీస్ వరుస విజయాలకు ఎవరు బ్రేక్ వేస్తారో వేచి చూడాలి. *

కథ

కూలి

✻ ఎల్.శాంతి

మెల్లమెల్లగా తెల్లవారుతోంది. వీధిలో అలికిడి మొదలయింది. అంతలో వీధికొన నుంచి పార్వతమ్మ పిలుపు... ఆమె వీధిలో వడివడిగా నడుస్తూ అందర్నీ కేకేస్తోంది.

'ఎల్లవ్మా.., నరనవ్మా... ఓ..లచ్చిమి...ఇంకా తెవల్లేదటే... లెగండి, లెగండి...'

'అయిపోయిందిలేగానీ, ఇదుగో పార్వతమ్మక్కా.., అల్లా మణమ్మని కూడా కుసింత కేకేసిద్దూ' అంది లక్ష్మి.

పార్వతమ్మ అప్పటిదాకా భుజాన ఉన్న తుండుగుడ్డను చేతుల్లోకి తీసుకుంది. జాగ్రత్తగా చుమ్మ చుట్టుకొని తలమీద పెట్టుకుంది. చేతిలో ఉన్న చద్దన్నం కేరేజీ దానిపైన పెట్టుకుంది. మణమ్మ ఇంటివేపు గబగబా అడుగులేసింది.

పద్మ చురుగ్గా పనులు పూర్తి చేస్తోంది. అంతలో 'పద్మతల్లీ... బయలెల్లే, పార్వతమ్మ కేకేసేత్తాంది. అందరూ వచ్చీనారు గావాల. ఈ రోజన్నా కూలి దొరుకుద్దో లేదో..' అంది ముసల్ది. 'నువ్వూరుకోయే, మామ్మ... నేనేదో చేసుకొత్తాగా.' అంటూ పద్మ తొందరతొందరగా పని తెముల్చుకుంటోంది.

ముసల్ది తనలో తాను గొణుక్కుంటూనే ఉంది.

'అప్పుడు పనులు వెతుక్కోవటం ఉండేది కాదు. ఏటెల్లకాలం పనే. ఇప్పుడు పనిని వెతుక్కోవటమే పెద్ద పనయిపోయింది.'

పద్మకు పెళ్లయి మూడు నెలలయింది. ఆమె తన కూతురు కూతురు. కొడుకు సూర్యంతో పెళ్లి జరిపించింది. పేగుబంధమైతే తన ఆలనాపాలనా సాఫీగా సాగిపోతాయని మనవరాలినే కోడలిగా చేసుకుంది. పద్మ వచ్చిన నాలుగు రోజులకే అందరితోనూ కలసిపోయింది.

ముందెప్పుడూ లేనివిధంగా ఈ ఏడు కరువు. వానల్లేవు, పంటల్లేవు, పనుల్లేవు, మంచినీళ్ళు లేవు. ఊరు ఊరంతా కరువే. నేలనేలంతా కరువే. ఎక్కడ చూసినా కరువే. పూట గడవటం కష్టమైపోతోంది. ముసల్ది వళ్లో శక్తి ఉన్నంతకాలం కష్టించి పని చేసింది. కాయకష్టంతోనే కొడుకును సాకింది. అయితే, ఎప్పుడూ కూలిపనికి వెతుకులాడింది లేదు. రెండు మడిసెక్కలైనా సొంతానికి లేకపోయినా పనులకు లోటుండేది కాదు. ఉజ్జీలు ఉజ్జీలుగా జనాలను తానే కదిలించుకువెళ్ళేది. ఊరు పొలాలన్నీ తన చేతి ఉడుపుతోనే కళకళ్లాడేవి. ఉడుపులు, ఆకుతీత, గావుతీత, కోతలు, నూర్పిడి.... అన్నీ పనులే! ఒంట్లో శక్తుంటే ఊరంతా పనే. సంపాదించిందేమీ లేకపోయినా కూటికి మాత్రం కరువుండేది కాదు. ఊరు పండితే ఊకయినా దొరుకుద్ది. నేల పండితే లేమి కనపడదు.

ఈ ఏడు పరిస్థితి దారుణమైపోయింది. తొలకరి రోజులనుంచి చిటుక్కున చినుకు లేదు. చూద్దామన్నా కాస్త పచ్చదనం లేదు. నేలంతా బీడు. ఊరంతా వల్లకాడు.

కొడుకు జ్ఞాపకం వచ్చాడు. ముసల్దాని కంట్లో నీళ్ళు తిరిగాయి. కొడుకు సూర్యం ఏదన్నా పని దొరుకుద్దాని రెండు నెల్ల క్రితం హైదరాబాదు వలస వెళ్లాడు. ఇంతకుముందు ఎప్పుడూ వెళ్ళలేదు. ఐదు దాటాక చదువు చెప్పించకపోయినా కాస్త ముద్దుగానే చూసుకుంది. కష్టమంతా తానే పడింది. తాను మంచాన పడేదాకా కొడుకుకు కష్టం కలక్కుండా చూసుకుంది. ఇప్పుడు వెళ్ళకతప్పింది కాదు. ఇళ్ళు కట్టే పనులుంటాయని పక్కూరు మేస్త్రీ తీసుకెళ్ళాడు. అంతా కాలం మహిమ! పెళ్ళయి నెల. అచ్చటాముచ్చటా తీరనే లేదు. పాపం... చిన్నపిల్ల. ఒంటరిగా ఒదిలేసి పోకతప్పలేదు.

'మామ్మా నే ఎల్తన్నాను.' అన్న మాటలకు ఆలోచనల్లోంచి బయటపడింది. పద్మ అందరితో కలిసి బయల్దేరింది. చద్దన్నం కేరేజీ చేత్తో పట్టుకుంది.

తమ్ముడిని కేకేసి జాగ్రత్తలు చెప్పింది : 'ఒరేయ్ రామూ, అక్కడా ఇక్కడా తిరగమాక, బడికెల్లు, పలకాబలపం గూట్లో పెట్టాను' అంటూనే వీధిగుమ్మం దాటిపోయింది.

'నిన్నగాక మొన్న పెళ్ళయిన పిల్ల. ఇన్నాళ్లూ కూలివెొకవే ఎరిగింది కాదు. దీనికెన్ని కష్టాలొచ్చాయెో..! మాయదారి కరువు కాలం. ముద్దాముచ్చటా తీరకముందే మొగుడూ పెళ్లాల్ని ఏరు సేసీంది...' అంటూ ముసల్ది బాధపడింది.

అప్పటికే పార్వతమ్మ వీధిగుమ్మం చివరన జట్టును కూడేసింది. మొత్తం పాతికమంది దాకా ఆడవాళ్లు. వాళ్లంతా 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణానికి బయల్దేరారు.

* * *

అందరూ మాట్లాడుకుంటూ రోడ్డుదాకా వచ్చారు. బస్సు ఆగే చోట ఒక వారంపుగా నిల్చున్నారు. పార్వతమ్మ పక్కన నిలబడింది పద్మ. రోజూ ఉన్నంత కలివిడిగా లేదు. ఎవరితోనూ చెప్పుకోలేని దిగులేదో మనసులో ఉంది. చేతిలో ఉన్న పది రూపాయల కాగితంకేసి ఒక్కసారి చూసుకుంది. తన దగ్గర మిగిలినవి ఈ పది రూపాయలే. నిన్న రాత్రే బియ్యం అయిపోయాయి. పక్కింటి రాజమ్మనడిగి మానెడు

బియ్యం అప్పు తెచ్చింది. ఆ పది రూపాయలూ ఈ రోజు కూలి వెళ్ళేందుకు దారి ఛార్జీలకోసం జాగ్రత్తగా దాచిపెట్టింది. మూడు రోజులుగా కూలికోసం దారి ఖర్చులకు రానూపోనూ పాతిక రూపాయలు ఖర్చయిపోయాయి. మిగిలింది ఈ పదే. అంత కష్టపడి వెళ్లినా ఆ మూడు రోజులూ పని దొరకనేలేదు. ఈ రోజన్నా దొరుకుతుందో లేదో..! తమ్ముడికీ, అమ్మమ్మకీ ఇంత గంజి పొయ్యగలనో లేదోనని ఆలోచిస్తోంది.

సూర్యం హైదరాబాద్ వెళ్ళాక మొదటి నెల మూడొందలు పంపాడు. ఈ నెల అది కూడా పంపలేదు. పట్నం వెళ్ళొచ్చిన షావుకారు వెంకట్రావుని వివరం అడిగితే 'ఆడికక్కడ కూలేం దొరుకుతాది. రోజురోజుకీ పట్నమెల్లే జనం ఎక్కువైపోతున్నారు. అక్కడ మాత్రం అంతమందికి పనులెక్కడినుంచి వస్తాయి?' అన్నాడు.

షావుకారు మాటలు విన్న దగ్గర్నుంచీ పద్మ మనసు మనసులో లేదు. పని దొరక్కపోతే తిండికెన్ని కష్టాలో... అసలు తింటున్నాడో, లేదో... ఎలా ఉన్నాడో... ఏం చేస్తున్నాడో..! పరిపరివిధాలుగా పోతోంది మనసు.

అంతలో ఆర్టీసీ బస్సు వచ్చి ఆగింది. కొంతమంది ప్రయాణికులు బస్సెక్కుతున్నారు.

డ్రైవర్ కూలీలను చూసి 'ఏం.. మీకోసం బస్సు ఇంకో గంటాపాలేటి, అలా బొమ్మల్లా నిలబడ్డారే.. ఎక్కండి తొందరగా...' అన్నాడు. ఆ మాటలు విని నూకాలు అందుకుంది: 'ఏటి బాబూ... ఈ బస్సెక్కాలా... ఎర్రబస్సు మా బోటోళ్లకి ఎప్పుడో దూరమైపోనాది. ఓట్లు గుద్దించుకున్నోళ్ళు గద్దెనెక్కాక సార్జీలు పెంచేత్తుంటే ఎర్రబస్సెలా ఎక్కుతాం...' అంటూ శాపనార్థాలూ మొదలెట్టింది. బస్సు వెళ్లిపోయింది. అయినా ఆమె తిట్టడం ఆపలేదు. పద్మ నవ్వుకుంది.

కాసేపటికి లారీ వచ్చి ఆగింది. 'ఎక్కండెక్కండి... మనిషికి ఐదు...' క్లీనరు అరిచాడు.

'ఏటి నిన్నే కదా నాలుగు తీసుకున్నావు. ఇప్పుడు ఐదా.. ఏటీ రోజూ పెంచేత్తారేటి' అనడిగింది పార్వతమ్మ.

'రోజురోజుకీ డీజిలు ఛార్జీలు పెంచేస్తున్నారు. మేం మాత్రం పెంచమా? ఇష్టమయితే ఎక్కండి. కష్టమయితే మానేయండి' అన్నాడు క్లీనరు.

అప్పటికే టైమైపోతోంది. చేసేదేముంది? తిట్టుకుంటూనే లారీ ఎక్కారు. పద్మ ఏమీ మాట్లాడకుండా అందరితో పాటు ఎక్కి నిలబడింది.

* * *

సీతంపేట జక్షన్లో అందరూ లారీ దిగారు. అప్పటికే 200 మందిదాకా కూలీలు అక్కడ కూడివున్నారు. తీర్థంలాగా హడావిడిగా ఉందక్కడ. అందరిలో ఎవరి ఆలోచన వారిదే. కానీ అందరి ఆలోచనా ఒక్కటే. తనకు పని దొరకాలని. వారందరినీ ఒక్కసారి కలియజూసింది పద్మ. ఈ పూట కూడా కూలి దొరకదేమో అని గుబులు మొదలైంది. అంతలో కాంట్రాక్టరు వచ్చాడు. పార్వతమ్మను పిలిచి, 'నువ్వూ, మరో నలుగురూ వస్తే సరిపోతుంది. ఇంకెవ్వరూ రానవసరంలేదు. పని బాగా అలవాటైన వాళ్లే కావాలి. త్వరగా రండి. కృష్ణబజార్ సెంటర్లో బిల్డింగ్ వర్కుంది' అంటూ కంగారు పెట్టాడు. ఎవరెవర్ని తీసుకురావాలో అతడే ఎంచేశాడు. వాళ్ళంతా బయలుదేరారు.

పార్వతమ్మ పద్మ వైపు చూసింది. 'మాయదారి సచ్చినోడు... ఏనాడూ అందరికీ పనిచ్చినాడు కాదు. పైగా ఎవరెవర్ని తీసుకురావాలో కూడా ఆడే ఎంచీనాడు. నా కూతురే... రేపయినా ఏదోపని దొరక్కపోదు.. రేపు వద్దూగాన్లే. అందాక ఇంటికెల్లిపో' అని నెమ్మదిగా చెప్పింది.

'ఇంకా ఏటి లేటు. పదండి, పదండి' కాంట్రాక్టరు తొందర పెట్టాడు. పార్వతమ్మ బయల్దేరింది. పద్మకు నోట మాటరాలేదు. గుండె బరువెక్కింది. ఇంకెవరైనా పనికి పిలుస్తారేమోనని వారంతా కొంతసేపు ఎదురుచూశారు. అయినా ఫలితం లేకపోయింది. పని దొరక్కుండా చాలామంది మిగిలిపోయారు. ఓ గంటసేపు తర్వాత ఊరివేపు వెళ్ళే లారీ వచ్చింది. అందరితో పాటూ ఇరుక్కుంటూ నిలబడి, ఊరికి చేరింది.

* * *

పద్మ భుజాన ఉన్న తుండుగుడ్డను దులిపి మంచం మీద వేసింది. ఆ అలికిడి విన్న ముసిలిది, 'ఏవే.. పద్మతల్లీ.. ఈ రోజూ పని దొరకనేదటే' అంది బాధగా. సమాధానం చెప్పకుండానే ఇంట్లోకి నడిచింది పద్మ. రేపటి పూట ఎలా గడుస్తుందోనన్నదే ఆమె ఆలోచనంతా. ముసల్దానికి పరిస్థితి అర్థమైంది. మాట్లాడే ఓపిక లేక విచారంగా కళ్లు మూసుకుంది.

రాత్రి అప్పు చేసిన నూకలతో గంజి కాచింది పద్మ. చీకటి పడింది. తనూ, తమ్ముడూ, మామ్మా... తలో గుక్కెడు గంజి తాగారు. రాము పక్కనే ఉన్న నులక మంచమ్మీద నిద్రపోయాడు. పనులు ముగించుకొని ఆ పక్కన చేరబడింది పద్మ.

షావుకారు వెంకట్రావు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. జీవితంలో భరించలేనిది ఒంటరితనమే అనుకుంది. తన భర్తను ఒక్కసారి కళ్లారా చూడాలనిపించింది. అతడికి ఇంత తిండన్నా దొరుకుతుందోలేదో అనుకుంది. భర్త ఇంటికొచ్చేస్తే ఇక్కడే ఏ గెంజో తాగి బతికేద్దుము అనుకుంది. కష్టం సుఖం పంచుకోలేని బతుకులు ఎందుకు? అతడు తిరిగి రావాలన్నా ఛార్జీలకు కనీసం రెండొందలు ఉండాలి. పనే దొరక్కపోతే ఇక ఆ డబ్బులైనా ఎలా వస్తాయి?

పద్మ ఆలోచనలు రకరకాలుగా పోతున్నాయి. కరువు రాకముందు కలోగంజో తాగి, రోజూ ఇద్దరూ కష్టం సుఖం మాట్లాడుకునేవారు. కరువు కాలమొచ్చింది. సొంత మనుషులను దూరం చేసింది. తలచుకొని, తలచుకొని కుమిలిపోయింది. కన్నీళ్లు ఉప్పొంగాయి. తన తమ్ముడి వైపు తిరిగింది. తమ్ముడి చుట్టూ చేతులు వేసింది. దుఃఖాన్ని ఆపుకోవాలనుకుంది. కానీ ఆమె తరం కాలేదు. ఏడుస్తూ, ఏడుస్తూ ఎప్పుడు నిద్రపోయిందో ఆమెకే తెలీదు.

* * *

మెల్లమెల్లగా తెల్లవారుతోంది.

వీధిలో అలికిడి మొదలయింది.

అంతలో వీధికొసా నుంచి పార్వతమ్మ పిలుపు...

'ఎల్లమ్మా.., నరసమ్మా... ఓ..లచ్చిమీ... ఇంకా తెవల్లేదటే... లెగండి, లెగండి...'

'పద్మతల్లీ... బయలెల్లే, పార్వతమ్మ కేకేసేత్తాంది. అందరూ వచ్చీనారు గావాల. ఈ రోజన్నా కూలి దొరుకుద్దో లేదో..' అంది ముసల్ది.

అందరితో పాటు పద్మ మళ్లీ బయలుదేరింది. మరో మంచిరోజు రాకపోతుందా అన్న ఆశతో...

◆

పుస్తక పరిచయం

సామాజిక సమస్యలను చిలికిన 'కవ్వం'

'రాసుడు మనిష్టం
మాట్లాడుడు మనిష్టం
.... తెలివి మనదే

తెలుగు మనదే...'నంటూ పలు సామాజిక, రాజకీయ అంశాలను చిలికిన కవితా సంకలనం 'కవ్వం'. తరచూ రాస్తూ రాసిందంతా అపుడపుడూ అచ్చులో వత్తేస్తున్న కవి కందుకూరి శ్రీరాములు ఐదో కవితా సంపుటి ఇది. 2000 సంవత్సరం నుంచి 2002 వరకు తాను రాసిన 42 కవితలను 'కవ్వం' పేరుతో పుస్తకంగా తెచ్చారు. ప్రజా పక్షపాతం, సామాజిక నిబద్ధత గల శ్రీరాములు అంతర్వాహిని అన్ని కవితలలో కనిపిస్తుంది.

''ఆ రాతలు... వొట్టి మాటలు కావు... భజన కీర్తనలూ కావు. రెండు సమాంతర రేఖల మధ్య గురిపెట్టిన బాణాలు" అంటూ 'కవిధనుస్సు' అనే కవితలో కవి తన భావాలను చెపుతాడు. ఈ పుస్తకానికి 'కలం యోధుడి లాంగ్‌మార్చ్' అంటూ ముందు మాట రాసిన ప్రముఖ విమర్శకులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి కూడా ఇవే వాక్యాలకు పేర్కొంటూ ఈ కవితల్లో 'కవికి ఉన్న భావ స్పష్టత, భాషా స్పష్టత కొట్టొచ్చినట్లు న్నాయ'ని పేర్కొన్నారు. అది నిజం.

'గుట్టను నమ్మి
గునపాన్ని నమ్మి జీవించే
జీవుల నోట్లో మట్టికొడుతున్నాడు'

అంటూ పాలకుల ప్రైవేటీకరణ దూకుడును పేర్కొంటారు.

"పేదవాణ్ణి చూసి పెదవి విరిచినా ఫర్వాలేదు... పెత్తనం చలాయించాలని చూశారా?" అంటూ 'ప్రపంచీకరణ' పెత్తందారులను హెచ్చరిస్తారు.

ప్రపంచీకరణ ప్రాపంచిక దృక్పథంలో కవి విశ్లేషిస్తే "ఎలుకల మీద ఏనుగుల సవారి
ఎవరూ క్షమించరు" అనంటారు.

సామాజిక మార్పును ''మరో ప్రపంచం'గా వాంఛిస్తూ 'సమరశీలం' అనే కవితలో ''కొత్త చివుళ్ళు మొలవాలంటే
చీడపట్టిన కొమ్మగా
నరికేయడం సబబు..
యోధునికి బహుశా
సమరశీలం తల్లి ప్రేమ కన్నా



రచన : కందుకూరి శ్రీరాములు , వెల : రు. 30/- ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్, విశాలాంధ్ర, దిశ, నవోదయ పుస్తక కేంద్రాలు.

గొప్పది" అనంటారు.

రొమ్ము చరచి కాల్చండిరా అన్నాం
గుండుకు ఎదురు గుండె పెట్టాం
గుండెల్ని పేల్చాడు వాడు
గుండె వగిలిన నేల అగ్ని గుండమైంది.

అంటూ 'విద్యుత్ ఉద్యమం' నాడు స్పందించి రాసిన కవిత 'కరెంటు గీతం'. ఈ కవిత నాడు ప్రచురించిన 'వికసించిన విద్యుత్ తేజం' సంకలనంలో 'బషీర్‌బాగ్' పేరుతో ప్రచురించిన విషయాన్ని 'రాచపాళెం' ప్రస్తావించడం గమనార్హం.

మహబూబ్‌నగర్‌లో ఆకలి చావులు
కరీంనగర్‌లో చేనేత కార్మికుల హత్యలు
వరంగల్‌లో పత్తి రైతుల ఆత్మహత్యలు
మెదక్‌లో ఎదురు కాల్పులు
హైదరాబాద్‌లో మత కలహాలు...

అంటూ పాలక వర్గ నీతి కారణంగా తలెత్తిన సామాజిక రుగ్మతలనూ ఏకరువు పెడతారు.

మామూలుగా కనబడే దృశ్యాలను భావుకతతో కవిత్వీకరించడం గొప్ప క్రియ.

ఒక 'దృశ్యం'... నడివీధి జడివానలో
చిరిగిన పైటకొంగు
బిడ్డకు అడ్డుపట్టలేదుగానీ
తన నగ్న వక్షోజాలను దాచుకుంది...
బిడ్డతో సహా.

- 'ఆకుతో గాలి దోబూచులాడటం
కుచ్చిళ్ళతో వేళ్ళు సయ్యాట లాడటం... స్పర్శ'ంటారు 'వసంతం'లో.

తెలంగాణా ప్రాంతీయ వెనుకబాటు తనంపై కవి ఆవేదన, ఆగ్రహం వెల్లడించడంలో ప్రాంతీయ గుర్తింపును చాటడమూ కనిపిస్తుంది.

"నా పల్లెగిప్పుడు
చినిగిపోయిన బట్టయింది
గిట్లెందుకు అయితుందో తెలుస్తలేదు
పోతన్నా! పోతన్నా
నీ బాగోతం మళ్ళా సద్వుతా" నంటారు.

"పది జిల్లాల అగ్గిపుల్లల పెట్టె
కదిలిస్తే కందిరీగెల తుట్టె"ంటారు.

'సగం తెలుగు.. సగం ఉర్దూ
పాలలో నీళ్లలా యాసభాష
హిందూ ముస్లిం భాయీభాయీ - తెలంగాణ
ఉమ్మడి కుటుంబాన్ని గుర్తుకు తెస్తుంది" అంటారు.

"అలాయ్ బలాయ్" కవితలో
సామ్రాజ్యవాద ఉగ్రవాదంపైనా కవి తన అక్షరాస్త్రాలను సంధించారు.

"ఎలుకను చంపడానికి
ఇల్లును పేల్చేయడం.. ఇదేం యుద్ధనీతి ?" అంటూ ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా ఆగడాలను ప్రశ్నిస్తాడు. 'మాట్లాడుడు మనిష్టం' అని కాళోజీ చెప్పిన మాటలతో పాటు ఐక్యంగా పోట్లాడటం గురించీ పదునుగానే చెప్పారు.

"గుంపుగా గుమిగూడటం
ఊరేగింపుగా వెళ్ళటం
మేఘాలను చూసి నేర్చుకోవాలి"

అని కవి ఉద్బోధిస్తారు. చనుముక్కు అనే కవితలో మేఘం నుంచే స్ఫూర్తినిస్తూ...

"భూమి నుండి చినుకు స్తంభానికి
కట్టిన జెండా మేఘం" అని జయపతాకను చూపెడతారు.

ఝరీ పొయిట్రి సర్కిల్ (హైదరాబాద్) ప్రచురించిన ఈ సంపుటిని మంచి కాగితంపై, చక్కని ఫాంట్‌లో ముద్రించారు.

*టి.వై.కె.

స్వీకారం

ఊపిరిపాట

రచన : రాకుమార, వెల :రూ. 20/-; ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, దిశపుస్తక కేంద్రం, హైదరాబాద్

మీ భర్త మిమ్మల్ని ప్రేమించాలంటే

రచన : హిప్నో పద్మా కమలాకర్; వెల :రూ. 40/-; ప్రతులకు : హిమకర్ పబ్లికేషన్స్, 79-2-3, ప్రశాంతి ఎస్టేట్, తిలక్‌రోడ్, రాజమండ్రి.

నెగళ్ళు

రచన : చింతాడ రామారావు; వెల : రూ. 50/-; ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదరాబాద్; శ్రీ చింతాడ రామారావు, తిలక్‌నగర్, శ్రీకాకుళం-532 001.

రహితంగా దాడి చేశాడు. దాదాపు ఆరు గాయాల్ని కత్తితో చేయటంతో బ్రిగేడియర్ ఖన్నా స్పృహ తప్పి పడిపోయాడు. రమా ఖన్నా బాత్‌రూం బయట గడియవేసి ఉండటంతో బ్రిగేడియర్ ఎలాగో లేచి బాత్‌రూం గడియ తీశాడు. ఇది జరగకముందే ఓం ప్రకాష్ ఆ ఇంటిలోంచి గోడ దూకి పారిపోయాడు. ప్రతిరోజూ ఉదయం పూట బ్రిగేడియర్ ఇంటికి స్వీపర్‌గాపని చేసే ఒక వ్యక్తి వస్తాడు. ఓం ప్రకాష్ పారిపోతుండగా అతడు గమనించి ఇంట్లోకి వెళ్ళాడు.

తీవ్రంగా గాయపడి చావుబతుకుల్లో ఉన్న బ్రిగేడియర్‌ను ఆసుపత్రికి తరలించారు. కానీ అక్కడికి చేరుకోకుముందే బ్రిగేడియర్ చనిపోయాడు. రమా ఖన్నాకు ప్రాథమిక చికిత్స చేశారు. ఆ తరువాత ఆమె భర్త శవాన్ని తీసుకుని ఇంటికి వెళ్ళింది. అక్కడ చాలా మంది ఇరుగుపొరుగు గుమికూడి వున్నారు. రమా ఖన్నా చెబుతుండగా ఒక వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు రాసి అందజేశాడు.

పోలీసులు రంగంలోకి దిగి మూడు శవాల ఫొటోలను, నేర స్థలాల ఫొటోలను తీసుకున్నారు. ఓం ప్రకాష్ వాడిన కత్తిని, కారంపొడి డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. అతని గదిని వెతికితే పోలీసులకు ఒక ఫొటో దొరికింది. ఓంప్రకాష్ అంతకుముందు ఒకసారి యజమానికి చెందిన సైనిక దుస్తులను దొంగిలించి వాటిని ధరించి దిగిన ఫొటో అది. కానీ నేరస్థుడైన ఓం ప్రకాష్ ఈ నేరం జరిగిన తరువాత ఐదేళ్ళ దాకా పోలీసులకు పట్టుబడలేదు.

ఓం ప్రకాష్ పోలీసులకు దొరికిన తరువాత 1999లో అతనిపై ఛార్జిషీటు దాఖలు చేసి కోర్టుకు అప్పగించారు. డెహ్రాడూన్‌లోని అదనపు సెషన్స్ కోర్టులో ఓం ప్రకాష్ మీద మరో యువకుడి మీద హత్యానేరం కింద విచారణ కొనసాగింది. మరో యువకుడు ఎవరు అంటే ఓం ప్రకాష్ ప్రేయసికి అతడు సోదరుడు. విచారణ పూర్తయ్యాక సెషన్స్ జడ్జి ఐ.పి.సి. 302 కింద ఓం ప్రకాష్‌కు ఉరిశిక్ష విధించారు. ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులను వరుసగా హత్య చేసినందువల్ల అతనికి ఉరిశిక్ష విధిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నాడు. ఈ శిక్షను ఉత్తరాంచల్ హైకోర్టు కూడా ధృవపరచి నిందితుడు ఓం ప్రకాష్‌కు విధించిన ఉరిశిక్షను ఖరారు చేసింది.

నిందితుడు తనకు విధించిన ఉరిశిక్షను సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్ళాడు. అతని తరపున న్యాయవాది కోర్టు ముందు వాదిస్తూ- ఒకే వ్యక్తి ముగ్గురిని హత్య చేయటం అసంభవమని, కేవలం అనుమానంతో ఆ ఇంటి నౌకరు అయిన ఓం ప్రకాష్‌ను ఈ కేసులో ఇరికించారని, ఒకవేళ నిందితుడే ఈ హత్యలు చేసినప్పటికీ అతనికి ఉరిశిక్ష విధించటం చట్టబద్ధం కాదని తెలియజేశాడు.

ఓం ప్రకాష్‌కు విధించిన శిక్ష గురించి ఆలోచించే ముందు సుప్రీంకోర్టు ఈ కేసు పూర్వాపరాలను మొదటి నుంచి పరిశీలించింది. ఓం ప్రకాష్ ప్రవర్తనను గమనించింది. డాక్టర్ చెప్పిన సాక్ష్యం ప్రకారం మృతుల శరీరాలపై నిందితుడు చేసిన గాయాలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. నిందితుడు ముగ్గురు వ్యక్తులను ఒక పథకం ప్రకారం హత్య చేయడానికి పూనుకొని, ముందుగా వారి కళ్ళల్లో కారంపొడి చల్లి వారిని అతి కిరాతకంగా కత్తితో నరికి చంపినట్లు



నిందితుడు 19 ఏళ్ళ యువకుడే అయినప్పటికీ అతడికి తక్కువ శిక్ష విధించి అతనిలో మార్పు వస్తుందని ఆశించటం సబబు కాదు. నిందితుని మీద ఆధారపడిన వ్యక్తులు కూడా లేరు. ఇలాంటి వ్యక్తిని గనుక వదిలి వేస్తే ఇతడు సమాజానికే ప్రమాదకరంగా తయారవుతాడు. ఇలాంటి చాలా అరుదైన కేసుల్లో ఉరిశిక్ష విధించటం చట్టబద్ధమే అని సుప్రీంకోర్టు భావించింది. సెషన్స్ కోర్టు, హైకోర్టులు విధించిన ఉరిశిక్షను సుప్రీంకోర్టు ధృవీకరించి తుది తీర్పు చెప్పింది.

సుప్రీంకోర్టు భావించింది.

ఈ హత్యలకు నిందితుడు పాల్పడటానికి తగిన కారణం కూడా ఉంది. హత్యలు జరగటానికి ముందురోజే అతడి ప్రవర్తన సరిగా లేదని, అతడిని పనిలోంచి తీసివేస్తున్నట్లు బ్రిగేడియర్ కుటుంబం అతడికి తెలిపింది. ఇది నచ్చని నిందితుడు కక్షతో రగిలిపోయి ఆ మరుసటిరోజే కుటుంబం మొత్తాన్నీ సమూలంగా హత్య చేసేందుకు పూనుకొని నలుగురిలో ముగ్గురిని చంపటంలో సఫలీకృతుడయ్యాడు. అంతకుముందు అతడు పెంపుడు పక్షిని చంపటం, మరో పక్షిని హింసించటం వల్ల అతని క్రూర ప్రవర్తన బయట పడింది. ఈ హత్యానేరాలను చాలా అరుదైన నేరంగా పరిగణించవచ్చు. నిందితుడు చాలా తెలివిగా ముందు వేసుకున్న పథకం ప్రకారం కిరాతకంగా ఈ హత్యలను గావించాడు.

నిందితుడు 19 ఏళ్ళ యువకుడే అయినప్పటికీ అతడికి తక్కువ శిక్ష విధించి అతనిలో మార్పు వస్తుందని ఆశించటం సబబు కాదు. నిందితుని మీద ఆధారపడిన వ్యక్తులు కూడా లేరు. ఇలాంటి వ్యక్తిని గనుక వదిలి వేస్తే ఇతడు సమాజానికే ప్రమాదకరంగా తయారవుతాడు. ఇలాంటి చాలా అరుదైన కేసుల్లో ఉరిశిక్ష విధించటం చట్టబద్ధమే అని సుప్రీంకోర్టు భావించింది. సెషన్స్ కోర్టు, హైకోర్టులు విధించిన ఉరిశిక్షను సుప్రీంకోర్టు ధృవీకరించి తుది తీర్పు చెప్పింది. ఒకవేళ రాష్ట్రపతి కనికరిస్తే ఉరిశిక్షను తప్పించుకుని జీవితఖైదును అనుభవించాల్సి ఉంటుంది. అలా కాకుండా నిందితుడి విజ్ఞప్తిని రాష్ట్రపతి తోసిపుచ్చే అవకాశం కూడా ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఓంప్రకాష్‌ను ఉరివేసి ప్రాణం తీస్తారు. ◆

బోధన

✳ **కొండబాబు**

పిల్లలంతా రంగులు చల్లుకుంటున్నారు. అల్లరిగా... హడావిడిగా ఉంది కాలనీ.

"అరే.. అరే.. వంటి నిండా ఆ రంగులేమిట్రా... సిరా కూడా చల్లుకుంటున్నారు పోదురా" అంది అమ్మమ్మ.

అంత ఉరుకులు, పరుగులు, ఉల్లాసంలోనూ వంశీ అమ్మమ్మ వైపు ఆసక్తిగా చూశాడు.

"సిరా ఏంటి? అమ్మమ్మా?" అనడిగాడు.

"సిరా అంటే ఇంకురా.. పెన్నుల్లో పోసుకుంటాం కదా!" వివరించిందామె. "అది సరే ఎందుకు రంగులు చల్లుకుంటున్నారు?" మళ్ళీ అడిగిందామె.

"ఇవాళ హోలీ అమ్మమ్మా" చెప్పాడు వంశీ.

"ఓ.. ఇవాళ కామునిపున్నమటరా!" అందామె కళ్ళు వెలుగుతుండగా

ఆసక్తిగా మళ్ళీ అమ్మమ్మ వైపు చూశాడు వంశీ.

* * *

"పాతిక రూపాయల కంటే ఎక్కువుండదు. బేరమాడు" తాతయ్య చెప్పాడు.

తేజా అర్థం కానట్లు చూశాడు. వాళ్ళ తాతయ్య ఒక పెన్ను కొనుక్కురమ్మన్నాడు పదేళ్ళ తేజాను. పెన్ను బ్రాండు పేరు చెప్పారాయన. ధరా చెప్పారు.

మనకు చిల్లర తిరిగొస్తాయమ్మా ఆయన అనునయంగా వివరించాడు.

"పాతికంటే ఎన్ని తాతయ్యా?" అడిగాడు తేజా.

"పాతికంటే అర్థం కాలే! ఇరవై అయిదురా" ఆశ్చర్యపోయాడాయన.

"ఇరవై అయిదంటే?" తేజా. మరింత ఆశ్చర్యపోయాడాయన "ఇదేంటమ్మాయీ వీడిలా అడుగుతున్నాడు" కోడలికి ఫిర్యాదు చేశాడాయన. ఆయన అంతకుముందు రోజే వచ్చాడు ఊరునుంచి. మనవడి పరిస్థితి అర్థం కాలేదు తనకు.

"ట్వంటీ ఫైవ్ అని చెప్పండి మామయ్యగారూ" లోపలి నుంచి కోడలి సమాధానం.

పరిస్థితి అర్థమయింది పెద్దాయనకు.

* * *

మాతృభాషలో వ్యవహార జ్ఞానం తెలియకుండా పోతున్న పిల్లల పరిస్థితికి ఈ రెండు ఉదాహరణలూ అద్దం పడతాయి. వీటిలో కొన్ని అవసరాలు, మరికొన్ని ఆచారాలు. అవసరాలు అవశ్యంగా తెలియాలి. ఆచారాలు సంస్కృతికి సంబంధించినవి. వాటిలో అనవసరంగా మారిపోయిన



వాటిని వదిలేయవచ్చు. పాటిస్తున్న వాటి గురించి తెలియడం అవసరం. తెలిసిన దాంట్లోంచే అది అవసరమో, అనవసరమో నిర్ణయించుకుంటాం. ఆచరించేవైనా, ఆచరించనివైనా సంస్కృతిలోంచి వచ్చే ప్రతి విషయంపైనా కొంత అవగాహన కలిగుండటం అవసరం. అదీ మాతృభాషలోనే తెలియాలి. మన సంఖ్యలు, సంస్కృతి కూడా పాశ్చాత్యభాషలోనో, పొరుగు భాషలోనో తెలియకపోవడం మనపై మనం సానుభూతి చూపుకోవాల్సిన విషయమవుతుంది. ఈ సమస్య ఎక్కడ నుండి మొదలవుతున్నదంటే పాశ్చాత్య భాషపై మోజు, ప్రభుత్వాల తీరుతెన్నులతో పెరుగుతున్న ప్రైవేటు విద్య ఇందుకు కొంత కారణాలు.

మాతృభాష సమగ్రంగా కాకపోయినా స్పష్టంగా తెలిసుండాలి. దాంతో పాటు ఆంగ్లభాష లేదా వేరే భాషలూ తెలిసుండటం మంచిదే. ఇందుకోసం ఆయాభాషలను విడిగా నేర్పడం మంచిదే. కానీ మొత్తం అంశాలను వేరే భాషల్లో నేర్పడమే అశాస్త్రీయం.

వేరే భాషా మీడియంపై మోజులో కాకపోయినా, వసతులు సరిగ్గా ఉండని, సరిగ్గా బోధించని ప్రభుత్వ స్కూళ్ళలో చదివించలేక ప్రైవేటు స్కూళ్ళలో చేర్పిస్తున్నాం అనే మాటను కొందరు అంటూంటారు.

అలాగే 'తెలుగేరాని టీచర్ల'తో విద్యాబోధన అని ప్రైవేటు వాళ్ళు కూడా ప్రచారం చేసుకోవడం గమనార్హం. అంటే తెలుగు రాకపోవడం అర్హతన్నమాట. ఆ టీచర్లకు బోధనా పటిమ, బోధనార్హతలు లేకపోయినా ఫర్వాలేదన్నమాట. ఈ రెండూ ఆలోచించాల్సినదే. వాస్తవంగా ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హులైన టీచర్లున్నారు. కానీ తగిన పర్యవేక్షణ, వసతులూ లేకపోవడమే ప్రథమ లోపం. ప్రతి ప్రజాప్రతినిధీ, అధికారీ తమ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్కూళ్ళలోనే తమ పిల్లలను చదివించే ఆదర్శం పెట్టుకుంటే ఈ సమస్యా పరిష్కారమవుతుందనేది కొందరు సూచించే పరిష్కారం. అంటే మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్లు మున్సిపల్ స్కూళ్ళలోనే తమ పిల్లలనూ చదివిస్తే వారికోసమైనా సరైన పర్యవేక్షణ, వసతుల కల్పనా చేస్తారనేది వారు చెప్పేమాట.

ఇలాంటప్పుడే సరైన అర్హతలున్న ఉపాధ్యాయులలో బోధన, మాతృభాషా జ్ఞానం, ఆంగ్ల భాషా పరిజ్ఞానం అన్నీ సక్రమంగా అలవరచుకోగలం. ఎన్ని భాషలనైనా నేర్చుకోవచ్చు. నేర్పవచ్చు. అది అదనం. ఆప్షనల్. కానీ అన్ని సబ్జెక్టులనూ మాతృభాషలోనే నేర్పాలి. ఇది తప్పనిసరి. మన దేశంలోనే కొన్ని దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలలో దగ్గర దగ్గరగా ఈ పద్ధతినే అవలంబిస్తున్నారు.

అప్పుడే రాబోయే తరాలకు మృతభాష కాకుండా మాతృభాష మనగలుగుతుంది. ◆

పాఠక స్పందన

'పొగతాగడం'పై నిషేధం అమలు కావాలి

మార్చి 16 సంచికలో జీవనశైలి శీర్షికన 'పొగతాగని సమాజం' సాధ్యమేనా వ్యాసం పొగతాగడం వల్ల నష్టాలను పాఠకులకు చక్కగా వివరించింది. సినిమాల్లో హీరోలు సిగరెట్లు విలాసంగా కాల్చడం చూసి అభిమానులు కూడా విలాసంగా భావించి ఈ దురలవాటుకు బానిస లవుతున్నారు. ప్రకటనల ప్రభావం కూడా ఎంతో ఉంది. కాని ఈ అలవాటు వలన వచ్చే జబ్బుల గురించి ఎవరూ ఆలోచించడం లేదు. ఈ వ్యాసం ద్వారానైనా పొగతాగడం వల్ల వచ్చే నష్టాలు ప్రజలు గ్రహించాలి. దీనిపై నిషేధం కఠినంగా అమలు కావాలి. రచయిత భావించినట్లు స్మోకర్లే లేని సమాజం రావాలి.

– సరికొండ శ్రీనివాసరాజు, మిర్యాలగూడ

కనువిప్పు

మార్చి 16 సంచికలో ప్రచురించిన ఆరోగ్యం శీర్షికన తల్లిపాలే బిడ్డకు ఎందుకు సంపూర్ణ ఆహారమో ప్రతీ తల్లికి అర్థమయ్యే రీతిలో వివరించడానికి, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డా॥ జి.ప్రతాప్‌కుమార్ గారు 'సాధారణ వ్యాధులు – నివారణ పద్ధతులు" అన్న అంశంపై చాలా వివరంగా విశదీకరించారు. బిడ్డకు పాలిస్తే గ్లామర్ తరిగిపోతుందనుకునే అభూత కల్పనలో శిశువును తల్లిపాలకు పురిటి నాడే దూరం చేస్తూ, శిశువును అనారోగ్యానికి గురి చేస్తున్న కొంతమంది స్త్రీలకు కనువిప్పు కలిగించే వ్యాసమని చెప్పవచ్చు. ఇంతమంచి శీర్షికను అందించిన ప్రజాశక్తికి మా అభినందనలు

– డి.వి.రెడ్డి, అనకాపల్లి